# కుట్రల కాంగ్రెస్‌ను నమ్మితే ఆగం

- 24గంటలు కరెంట్ తీసేస్తరు.. మూడు గంటలే ఇస్తరు
- అది ఎప్పడిస్తరో తెల్వదు
- 10 హెచ్‌పీ మోటర్లతో బతుకులు ఆగమే
- మోటర్లకు మీటర్లు పెడుతరు.. నిండా ముంచుతరు
- ఈ ఎన్నికల్లో ఆ పార్టీని తరిమికొడుతం
- స్పష్టం చేసిన కుమ్రం భీం జిల్లా రైతులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌ను నమ్మితే బతుకులు ఆగమవుతాయని జిల్లా రైతులు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ వచ్చేదాక ఏసోంటి గోస పడ్డమో.. ఎన్ని కష్టాలు పడ్డమో ఆ భగవతునికే తెలుసని వాపోతున్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు గానీ, అన్నదాతలను ముంచే కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలు అని చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. 24 గంటల కరెంట్ ఉన్న కాడ ఈ మాయమాటలేందని నిలదీస్తున్నారు. పైగా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని ఉచిత సలహా ఇవ్వడంపై ఆగ్రహిస్తున్నారు. రెండు రోజుల క్రితమే ఆ పార్టీ అసలు రంగు బయటపడిందని, కేంద్రం మంత్రి నిర్మలా సీతారామన్ మాటలతో కాంగ్రెస్ మోటర్లకు మీటర్లు పెట్టే కుట్ర బట్టబయలైందని మండిపడుతున్నారు. వాళ్లను నమ్మితే మోటర్లకు మీటర్లు పెడుతరని, 24 గంటల కరెంట్ తీసేసి 3 గంటల ఇస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు వాళ్ల పాలనలో అరిగోస పడ్డామని, కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియక రాత్రిళ్లు జాగారం చేశామని, కండ్ల ముందే పంటలు ఎండుతుంటే కన్నీళ్లు పెట్టుకున్నామని గుర్తు చేశారు. దొంగ రాత్రి కరెంట్ ఇచ్చి ఎందరో రైతుల ఉసురు పోసుకున్న ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

## పది హెచ్‌పీ మోటర్ కాంగ్రెసోళ్లు కొనిస్తారా..



కాగజ్‌నగర్, నవంబర్ 24: ఎన్నికల ప్రచారంలో కాంగ్రెసోళ్లు ఏదో ఏదో మాట్లాడుతున్నరు. ఇగ వాళ్లకు ఓడిపోతున్నమని అర్థమైపోయినట్లుంది. పది హెచ్‌పీ మోటర్ పెట్టమంటున్నరు. వాళ్లు కొనిస్తరా...అంత పెద్ద మోటరు కొనుడంటే రైతులతోని అయితదా..? ఆలోచన లేకుండా ఏదిపడితే అదే మాట్లాడుతున్నరు. ఎవుసానికి మూడు గంటల కరెంట్ చాలు. పది హెచ్‌పీతో పంట సాగు చేయచ్చు అంటున్నరు. మోటర్లతో భూగర్భ జలాలు అడుగంటిపోతయ్. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయి. దీంతో ఇబ్బంది పడేది మళ్లీ రైతులే. కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా కరెంటియ్యకపోతే గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. ఎంత ఇబ్బంది పడ్డామో మాకు తెలుసు. తెలంగాణ ప్రభుత్వం 24 గంటలు ఉచిత కరెంట్ ఇస్తున్నది. మూడు హెచ్‌పీ మోటర్లతో దర్జాగా వ్యవసాయం చేసుకుంటున్నం. గీ కాంగ్రెసోళ్లు మళ్లీ మా బతుకులల్ల పుల్లలు పెట్టేందుకే చూస్తున్నరు. -రాములు, రైతు, కాగజ్‌నగర్

## మోసం మాటలు చెప్పబోయి వాళ్లే ఇరుక్కున్నరు



రోజంతా అత్తున్న కరెంట్‌తో రైతులు సుఖంగా ఉంటున్నరు. ఇదీ కాంగ్రెసోళ్లకు ఇట్టం లేనట్టుంది. తెలంగాణ రాకమునుపు ఎవుసానికి కరెంటు కోసం పడిన బాధలు చాలు. మూడు గంటల కరెంటుతో మళ్లా గా కట్టాలు తప్పవ్. మూడు గంటల ఇత్తామంటున్న రేవంత్‌కు మతిలేనట్లుంది. ఆళ్లకు తలెరుకనా.. తోకెరుకనా?. సోయిలేని మాటలు మాట్లాడుతున్నరు. గిప్పుడు ఎప్పుడంటే గప్పుడే బాయి కాడికి పోయి మోటరు పెట్టుకుంటున్నం. మూడు గంటలు ఇత్తే పాత కథే ఉంటది. రైతులందరూ ఒకేసారి మోటరు పెడితే కాలిపోతయ్. ట్రాన్స్‌ఫార్మర్లు పేలుతయ్. ఫ్యాన్ల కింద కూకొని మాట్లాడుడు కాదు...ఎవుసం జేత్తే తెలుస్తది. రైతుకు ఏ ఇబ్బందీ రాకుండా కేసీఆర్ సారు చూసుకుంటున్నడు. మళ్లా గాయనే గెలుస్తడు. గులాబీ జెండానే ఇష్టం. -చౌదరి రాజు, గిరవెల్లి

## బుద్ధి ఉనోళ్లు గట్ల మాట్లాడరు..



దహెగాం, నవంబర్ 24: కాంగ్రెసోళ్లు అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు. వాళ్లదంతా ఉట్టి ముచ్చటే. రైతులకు మూడు గంటల కరంట్ చాలని అంటున్నరు. బుద్ధిగలోళ్లు ఎవ్వలూ గట్ల మాట్లడరు. రైతుల విషయంలో రకరకాల మోసపూరితమైన మాటలు చెబుతున్నరు. మూడు గంటల కరంటిస్తం. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలె. అని పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నరు. ఆ పెద్ద మోటర్లు కాంగ్రెసోళ్లు కొనిస్తరా.. వాళ్లకు చేతనైతదా..? రైతులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం మళ్లోసారి కాంగ్రెసోళ్లు చేస్తున్నరు. వీళ్లతోని ఏ పనికాదు. ఢిల్లీకి సలాం కొట్టే లీడర్లు మన తెలంగాణోళ్లకు ఏం మంచి చేస్తరు. రైతులను అక్కున చేర్చుకున్న సీఎం కేసీఆర్‌ను ఎందుకు కాదనుకుంటం. ఆయనే మళ్లా సీఎం అయితరు. లేకుంటే ఈ బుద్ధి లేని కాంగ్రెస్ లీడర్లను నమ్ముకుంటే నిండా మునుగుతం. వీళ్లు ఢిల్లీ చేతుల పాలన పెడుతరు. మన సొమ్మంతా ఢిల్లీకి పంపుతరు. అందుకే ఆలిగినా, గులిగినా మనోళ్లు మనకే. -ఎస్‌కే నజీర్, ఒడ్డుగూడ

## మూడు గంటల కరెంట్ వద్దు.. వాళ్లూ వద్దు



దహెగాం, నవంబర్ 24: రైతుల విషయంలో కాంగ్రెసోళ్లు పెద్ద కుట్రనే చేస్తున్నరు. వాళ్లిచ్చే మూడు గంటల కరంటు వద్దు.. వాళ్లూ వద్దు. ఏమి పంటలే పండని భూముల్లో ఈ పదేళ్లలో కేసీఆర్ సార్ దయ వల్ల రెండు పంటలు పండిస్తున్నం. కాంగ్రెస్ కాలంలో కరెంటుకు చాలా ఇబ్బందులుండేవి. పనులు వచ్చినా కరెంటు లేక డబ్బులు అంతంత మాత్రమే వచ్చేవి. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కరంటు కష్టాలు తొలిగినయ్. వెల్డింగ్ పనులు వచ్చినా కరెంటు కోసం ఎదురు చూసేది. అద్దె కిరాయి కట్టడానికి ఇబ్బంది ఉండేది. నిత్యం త్రీ ఫేజ్ కరంటుతో పనులు బాగా చేసుకుంటున్నం. మళ్లీ కాంగ్రెసోళ్లు ఆ పుటి కష్టాలు తేవాలని చూస్తున్నరు. వాళ్లను నమ్మేది లేదు. వాళ్లకు ఓటేసే ది లేదు. ప్రజలందరూ మంచిగ ఉండాలెంటే మళ్లీ కేసీఆరే మళ్లీ రావాలె. గులాబీ జెండా అంతటా ఎగరాలె. -హస్త వెంకటి, గిరవెల్లి..

## 10 హెచ్‌పీ మోటర్లతో బోర్లు కూలిపోతయి



దహెగాం, నవంబర్ 24: 10 హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లు కూలిపోతయి. మా బోర్లకు 5 హెచ్‌పీ మోటర్లే సరిపోతయి. 10 హెచ్‌పీ మోటర్లకు కరంటు బాగా కాలుతది. ఎప్పుడూ కరంటుకు ఇబ్బందైతది. మూడు గంటలు ఇస్తమంటున్నరు. మూడు గంటల్లో 10 గుంటల పొలం కూడా తడవదు. ఇగ మళ్లోసారి రైతులను ఇబ్బంది పెట్టే ప్లాన్ చేస్తున్నరు. గతంలో కటిక చీకట్ల పోయి పొలాల కాడ ఇబ్బందులు పడినం. ఇప్పుడు ఎప్పుడంటే అప్పుడు కటుకేస్తే బోర్ల నుంచి నీళ్లు వస్తున్నయ్. రేవంత్ రెడ్డికి పొలం చేసుడు ఎట్లనో తెలిస్తే, గిట్ల మాట్లడడు. రైతులు కష్టం మొత్తం అవమానించినట్లే కాంగ్రెసోళ్లు మాట్లాడుతున్నరు. మూడు గంటల కరెంట్ చాలంటున్నరు.. రైతు బంధు వద్దంటున్నరు. ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తమంటున్నరు.. ఇగ వీళ్లను నమ్మితే జనాన్ని కూడా గంగల కలుపుతరు. అందుకే వాళ్లను నమ్మం. -ఇంగిలి బాలాజీ, ఏనెగూడెం



## మూడు గంటలు కరెంట్‌తో ఎకరం తడవదు..



కాగజ్‌నగర్, నవంబర్ 24: కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే మూడు గంటలు కరెంట్ ఇస్తామంటున్నరు. ఎకరం పొలం కూడా పూర్తి స్థాయిలో తడవది. గతంలో వ్యవసాయానికి ఇచ్చిన కరెంట్ సరిపోకనే రైతులు దివాళా తీశారు. నీరున్నప్పటికీ కరెంట్ సరిగా ఉండక పంటలు ఎండిపోయేవి. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ సర్కార్ 24 గంటలు ఉచిత కరెంట్ ఇస్తుంది. దీంతో రెండు పంటలు పండిస్తున్నం. నిరంతరంగా కరెంట్ ఇవ్వడంతో తీరికను బట్టి పొలాలను తడుపుతున్నం. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచి రైతుల సమస్యలు తీరాయి, అప్పుల బాధలు తగ్గాయి. మళ్లీ ఈ కాంగ్రెసోళ్లు ఏదో మభ్యపెడుతున్నరు. వీళ్లు మోటర్లకు మీటర్లు కూడా పెడుతరు. అందుకే తెలంగాణ మంచిగుండాలంటే సీఎం కేసీఆరే ఉండాలె. ఆయనైతేనే రైతులు ఓ రెండు పంటలు పండించుకుంటరు. -వినోద్, వ్యవసాయ రైతు, కాగజ్‌నగర్

## మళ్లీ టార్చ్‌లైట్లు కొనుక్కునుడే..



-తుకారాం రైతు, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్, నవంబర్ 24: కాంగ్రెసోళ్లు చెప్పింది వింటే ఇగ మళ్లీ టార్చ్‌లైట్లు కొనుక్కునుడే అయితది. కాంగ్రెసోళ్లు ఇచ్చే మూడు గంటల కరెంట్ సరిపోదు. టెన్ హెచ్‌పీ మోటర్లు ఒకేసారి చాలు చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలడం తప్పదు. నిరంతరం కరెంటియ్యక పోతే పంటలు నష్టపోయి కాంగ్రెసోళ్ల హయాంలో రైతులు ఆత్మహత్య చేసుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. రైతులకు పట్టించుకోకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక 24 గంటలు కరెంట్ ఇవ్వడంతో రైతులు రెండు పంటలు పండిస్తున్నరు. గతంలో ఒక పంట పండించడానికే నానా తిప్పలు పడేవాళ్లం. పదేళ్లుగా రెండు పంటలు బాగా పండిస్తున్నం. నిరంతరం కరెంట్‌తో పాటు రైతు బంధు, రైతు బీమా అమలు చేస్తూ మా సమస్యలు తీర్చిన కేసీఆర్‌కు రుణపడి ఉంటం.

## 24 గంటల కరెంటియ్యరు..

కాగజ్‌నగర్, నవంబర్ 24: కాంగ్రెసోళ్లు 24 గంటల కరెంటియ్యలేరు. కరెంట్ ఇస్తే పంటలు బాగా పండుతయ్. రైతులు నిశ్చింతగా ఉంటారు. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు మూడు గంటలు కరెంట్, పది హెచ్‌పీ మోటర్లు పెట్టాలి అనడం సరికాదు. గిప్పుడు మేము ఎలాంటి ఇబ్బందులు లేకుండా మూడు హెచ్‌పీ మోటర్‌తో పంటలు పండిస్తున్నం. గతంలో కాంగ్రెసోళ్లు సరిగ్గా కరెంట్ ఇయ్యక, వర్షాలు కురువక పంటలు ఎండిపోయేవి. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకపోవడంతో తీరికున్నప్పుడు నీటి అవసరాన్ని బట్టి పంట పొలాలకు వెళ్లి నీరు పడుతున్నం. గిప్పుడు నేను మూడెకరాల్లో రెండు పంటలు తీస్తున్న. రైతుల కోసం 24 గంటలు ఉచితంగా కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే ఓటేసి గెలిపిస్త. మళ్లీ సీఎం కేసీఆరే గెలుస్తరు. తెలంగాణలో ప్రజలకు మంచి జరగాలంటే సీఎం కేసీఆర్‌తోనే అయితది. అందుకే అందరూ ఆయనే మళ్లీ సీఎంగా రావాలని అనుకుంటున్నరు. - అలగం రవి, వ్యవసాయ రైతు, కాగజ్‌నగర్

## కరంటు తీగలపై బట్టలు ఆరేసుకునుడే..



దహెగాం, నవంబర్ 24: కాంగ్రెసోళ్లు చెప్పింది వింటే ఇగ మనం కరంటు తీగల మీద బట్టలు ఆరేసుకునుడే తప్ప రైతులకు ఏం లాభముండదు. గింత మంచిగ రైతు లకు కరంటు ఇచ్చే అంత దమ్ము కాంగ్రెస్‌కు లేదు. మన సీఎం కేసీఆర్ సారు రైతు బిడ్డ గనుక రైతులను మంచిగుం డాలని మంచి కరంటు సౌకర్యం ఇస్తున్నడు. దీన్ని తట్టు కోలేక కాంగ్రెసోళ్లు ఇష్టమున్నట్లు మాట్లాడుతున్నరు. గతంలో కరెంటియ్యకనే రాత్రుల్లు పంటలకు సాగునీరు పెట్టడానికి వెళ్లి ప్రమాదాల పాలైనం. కాంగ్రెసోళ్లకు కరెంట్ గురిం చి, వ్యవసాయం గురించి ఏం తెలవదని అర్థమవుతున్నది. లేకపోతే మూడు గంటల కరంటు వ్యవసాయానికి ఏమన్న సరిపోతదా. ఆ కరంటుతో పంటలు పండించుకోలేం. గసొంటి కాంగ్రెసోళ్లు మనకెందుకు. కేసీఆర్ సారు ముఖ్యమంత్రి అయినంక కరంటు బాధలు తీరినయ్. రైతు రాజ్యం అంటే కేసీఆర్ పాలనలోనే సాధ్యమైంది. కాంగ్రెసోళ్లది ఢిల్లీ రాజ్యం. -బోరె పోశన్న, బ్రాహ్మన్‌చిచ్చాల

## రంది లేకుండా పంటలకు నీరందిస్తున్నం..



కాగజ్‌నగర్, నవంబర్ 24: తెలంగాణ సర్కారు 24 గంటలు ఫ్రీగా కరెంట్ అందించడంతో రంది లేకుండ పంట పొలాలకు నీరందిస్తున్నాం. కాంగ్రెసోళ్ల హయాంలో కరెంట్ కోసం ఎన్నో తిప్పలు పడ్డం. రాత్రి పూట మోటర్ల వద్ద పడుకొని నీరు పట్టేవాళ్లం. రాత్రి పూట విష పురుగుల భయం కూడా బాగా ఉండేది. రాత్రి పూట నీరు పట్టేందుకు పంట పొలాలకు పోతే ఇంట్లోని భార్య, పిల్లలు కూడా భయపడుతుండే. కానీ పదేళ్లుగా అలాంటి సమస్య లేకుండానే పగలు పంట పొలానికి పోయి నీరు పెడుతున్న. రైతుల కోసం మంచిగ ఆలోచించే కేసీఆర్ సార్ మళ్లీ ముఖ్యమంత్రి అయితనే మంచిగుంటది. లేదంటే కాంగ్రెసోళ్లతోని తిప్పలయితది. -కొమ్మ రాజన్న, రైతు, కాగజ్‌నగర్